క్లుప్తంగా

డీఏలు, పీఆర్సీ ఇవ్వలేమనడం సమంజసం కాదు



కామారెడ్డి టౌన్ : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి పడిన నాలుగు వాయిదాల డీఏను, జూలై 2023 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని అడగొద్దని, అవి కావాలంటే నెలనెలా జీతాలే ఇవ్వలేమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం సమంజసం కాదన్నారు. ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని వారికి న్యాయంగా రావాల్సిన బకాయిలను, దాచుకున్న సొమ్మును చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

'విద్యార్థులు జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకోలి'



కామారెడ్డి అర్బన్: విద్యార్థులు ముందుగా లక్ష్యాన్ని నిర్దేశించుకొని, అందుకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని వీ స్పోర్ట్ అండ్ ఏబీసీ ఎడ్‌టెక్ సీఈవో దిల్మిత్ చాదా అన్నారు. విద్యార్థిసేన ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం క్యాంపస్ టు కెరీర్ కార్యక్రమం ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ రమేష్ చైతన్య మాట్లాడుతు.. విద్యార్థులు అనుకున్నవి అన్ని కాకపోతే క్షణికావేశంలో ఆత్మహత్యలు, అఘాయిత్యాలకు పాల్పడవద్దని, మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు జయప్రకాష్, శ్రీనివాస్‌రెడ్డి, మీరా, కవిత, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధన



భిక్కనూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధన లభిస్తోందని ఎంఈవో రాజగంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జంగంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (బీసీ)ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల మార్కుల పట్టికలను పరిశీలించారు. చదువుతో పాటు క్రీడలపై విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలని ఎంఈవో సూచించారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): జీవితంలో స్థిరపడడానికి విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు సూచించారు. సోమవారం మండలంలోని బాణాపూర్, ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ విజయ స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు అజయ్, సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. భయం వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని సూచించారు. పదో తరగతి పూర్తయిన తర్వాత ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షల కిట్లు వితరణ చేశారు. కార్యక్రమంలో రామానుజాచారి, రాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం



బాన్సువాడ రూరల్: మండలంలోని నాగారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. గ్రామంలో ఇళ్లకు 79మందిని అర్హులుగా గుర్తించారు. ఎంపీడీవో బషీరుద్దీన్, డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారులు లబ్ధిదారుల ఇంటినిర్మాణానికి ముగ్గు వేసి పనులు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శులు నవీన్‌గౌడ్, సృజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం... చేరేనా..!

- బల్దియాలో పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి
- ఇప్పటి వరకు 56శాతం వసూలు



జిల్లా కేంద్రంలో ఓ ఇంటి ముందు బైఠాయించి పన్ను వసూలు చేస్తున్న అధికారులు, సిబ్బంది

కామారెడ్డి టౌన్: పట్టణంలో ఆస్తి పన్ను వసూళ్లపై బల్దియా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈనెల 31వ వరకు వంద శాతంతో పన్నులు వసూలు చేసి లక్ష్యం చేరేందుకు ఉన్నతాధికారుల దిశానిర్దేశంతో బిల్ కలెక్టర్లు, సిబ్బంది ప్రత్యేక బృందాలతో ఇంటింటా వసూళ్లు చేస్తున్నారు. పట్టణ అభివృద్ధికి ఆస్తి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. ఈ నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు పెట్టుకున్న లక్ష్యాన్ని చేరేందుకు ప్రణాళికతో ముందుకు పోతున్న ఇప్పటి వరకు 56.13శాతం మాత్రమే వసూలు అయ్యాయి. ఈ నెల 31లోపు వంద శాతం వసూళ్లు చేస్తారో లేదో వేచి చూడాలి మరి.

ఇంకా రూ. 6 కోట్లు వసూళ్లు కావాలి

బల్దియాలో 49 వార్డుల్లో 25వేలకు పైగా గృహాలు, 3వేలకు పైగా కమర్షియల్ భవనాలు ఉన్నాయి. ప్రతి ఏడాది రూ.13.56 కోట్ల ఆస్తి పన్ను డిమాండ్ ఉంది. ఏడాదిన్నర క్రితం బల్దియాకు రూ. 8 కోట్ల వరకు పన్నుల రూపేనా ఆదాయం సమకూరేది. స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదేశాలతో ప్రత్యేక సర్వే ద్వారా గృహాలు, వ్యాపార భవనాల రీకొలతలు చేయడంతో ఆదాయం మరో రూ.5 కోట్ల వరకు పెరిగింది. నూతనంగా 5 వేల గృహాలు పన్నుల జాబితాలో చేరాయి. సోమవారం వరకు రూ. 7.61కోట్ల పన్నులు వసూళ్లు కాగా, ఇంకా రూ. 5.95 కోట్లు రావాల్సి ఉంది. 49 వార్డుల్లో 23 బృందాల స్పెషల్ డ్రైవ్‌తో పన్ను వసూళ్లు చేస్తున్నారు. మొండి బకాయిదారులు స్పందించకుంటే వారి ఇళ్ల ముందు బల్దియా రెవెన్యూ విభాగం అధికారులు, బిల్ కలెక్టర్‌లు, సిబ్బంది బైఠాయించి మరీ పన్ను వసూలు చేస్తున్నారు. గతంలో మాదిరిగా ఈ సారి ఆస్తి పన్నుపై ప్రభుత్వం వడ్డీ మాఫీ అవకాశం కల్పించలేదని మొండి బకాయిదారులు వాపోతున్నారు.

వంద శాతం వసూళ్లకు కృషి



కామారెడ్డి బల్దియాలో ఇంటి, కుళాయిల పన్నుల డిమాండ్ రూ. 13.56కోట్లు ఉండగా ఇప్పటి వరకు 56శాతం వరకు పన్నులు వసూలు చేశాం. పక్కా ప్రణాళిక, ప్రత్యేక బృందం స్పెషల్ డ్రైవ్‌తో వసూళ్లు చేస్తున్నాం. ఈ నెలాఖరు వరకు వందశాతం వసూళ్ల లక్ష్యం చేరేందుకు కృషి చేస్తాం. సకాలంలో పన్నులు చెల్లించి ప్రజలు పట్టణ అభివృద్ధికి సహకరించాలి.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



తిమ్మాపూర్‌లో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న పోచారం



పిట్లంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సదాశివనగర్‌లోని బీసీ కాలనీలో ..

బాన్సువాడ : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు సోమవారం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మాపూర్ గ్రామంలో రూ.8 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, నాయకులు సాయిబాబా, శశికాంత్, రఘు, సందీప్, అరీఫ్, మన్నన్ తదితరులున్నారు.

పిట్లం(జుక్కల్)/పెద్దకొడప్‌గల్/సదాశివనగర్/ఎల్లారెడ్డిరూరల్ : పిట్లం మండలంలోని ముకుంద రెడ్డి కాలనీలో రూ.15 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంబింగే హన్మండ్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. సదాశివనగర్ మండలంలోని బీసీ కాలనీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 25లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, నాయకులు ప్రారంభించారు. ఎల్లారెడ్డి మండలంలోని సాతెల్లి, శివాపూర్ గ్రామాలలో రూ. 5లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, నాయకులు ప్రారంభించారు. పెద్దకొడప్ మండలంలోని పలు కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఓపెన్ కరాటే పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



చాంపియన్ ట్రోఫీని అందుకున్న నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు



పతకాలతో పిట్లం కేజీబీవీ విద్యార్థినులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి)/పిట్లం(జుక్కల్): మేడ్చల్‌లోని సుమంగళి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన ఆల్‌ఇండియా ఓపెన్ కరాటే పోటీల్లో మండలంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపారని కరాటేమాస్టర్ మంగలి యాదగిరి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన 17మంది విద్యార్థినులు స్పారింగ్ విభాగంలో పాల్గొని ప్రతిభ చూపి బంగారు పతకాలు, చాంపియన్ ట్రోఫీని సాధించారని ఆయన వెల్లడించారు. అలాగే పిట్లం మండల కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు అంజలి, రేణుక, ఆనందిని, నందిని, అశ్విని, దుర్గ, ఆలేఖ్య, రాజగోపిక, శర్మిలలు ఈపోటీల్లో ప్రతిభ చూపారు. వీరు 6 బంగారు, 3, వెండి, 2 కాంస్య పతకాలు సాధించారని పీఈటీ అన్నపూర్ణ తెలిపారు. విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపల్ గీతా, పీఈటీ శోభ, నిర్వాహకులు సాయికుమార్, కరాటే మాస్టర్ రవి, పీఈటీ అన్నపూర్ణలు ప్రత్యేకంగా అభినందించారు.

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



బాన్సువాడలో సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు



తాడ్వాయిలో తహసీల్దార్ రహీమొద్దీన్‌కు..



ఎల్లారెడ్డిలో డిప్యూటీ తహసీల్దార్ చరణ్‌సింగ్‌కు..

బాన్సువాడ : ఆశా వర్కర్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్ మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి)/ఎల్లారెడ్డి/లింగంపేట : ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని కోరుతూ ఎల్లారెడ్డిలో డిప్యూటీ తహసీల్దార్ చరణ్‌సింగ్‌కు, తాడ్వాయిలో తహసీల్దార్ రహీమొద్దీన్‌కు, లింగంపేటలో నాయబ్ తహసిల్దార్ సంఘమేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆశావర్కర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలను గ్రామాల్లో సర్వేలు చేయిస్తూ పారితోషికం ఇవ్వడం లేదన్నారు. సర్వేల పేరిట పనిభారం పెంచుతూ మానసిక ఇబ్బందులకు గురిచేస్తుందని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఉన్నారు.

సొసైటీ పాలకవర్గ పదవీకాలం పొడిగింపుపై హర్షం



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి సొసైటీ పాలకవర్గం పదవి ఆరు నెలలు పొడిగించడంపై పాలకవర్గ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. సొసైటీ పాలకవర్గ పదవి కాలం సోమవారం ముగియనుండడంతో వారికి కార్యదర్శి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ నర్సింలు, వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, డైరెక్టర్లు గోపి, సుఖేందర్‌రెడ్డి, నారాయణ తదితరులున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డి: పట్టణంలో ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి ఎస్సై మహేష్ సోమవారం తిరిగి ఫోన్‌ను అందించారు. వసంత్ ఇటీవల ఫోన్ పోగొట్టుకొని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. పోర్టల్ ద్వారా బాధితుడి ఫోన్‌ను గుర్తించి తిరిగి అందించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్ తదితరులున్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇటీవల రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో కంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు సోమవారం కంటి అద్దాలు అందజేశారు. అద్దాలను తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మమత, పాఠశాల హెచ్‌ఎం గంగాకిషన్, ఉపాధ్యాయులు జంగం శ్రీశైలం, రమేష్, లక్ష్మణ్, అశోక్, మానస తదితరులు పాల్గొన్నారు.

18 వరకు రేషన్ పంపిణీ గడువు పెంపు

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న మార్చి నెలకు సంబంధించిన బియ్యం పంపిణీ మంగళవారం వరకు కొనసాగుతుందని పౌరసరఫరాలశాఖ అధికారులు సోమవారం తెలిపారు. ఇప్పటి వరకు బియ్యం తీసుకోనివారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఎల్లారెడ్డిలో ఫిజియోథెరపి క్యాంపు



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని భవిత కార్యాలయంలో సోమవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. దివ్యాంగులకు ఫిజియోథెరపి వైద్యులు డాక్టర్ అరుణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశం తదితరులున్నారు.

ఆఫీస్ ప్యూన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టం కార్యాలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపాదికన ఆఫీస్ ప్యూన్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయమూర్తి టి. నాగరాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్హత, 34 ఏళ్ల వయస్సు మించకుండా ఉండాలన్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీలకు 5 సంవత్సరాల మినహాయింపు ఉంటున్నారు. ఈనెల 21వ తేదీ లోపు కామారెడ్డి డిస్ట్రిక్ట్ కోర్ట్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రూ.5లక్షలు పలికిన గోపాల్‌పేట తైబజార్



తైబజార్‌కు వేలంపాట నిర్వహిస్తున్న గోపాల్ పేట జీపీ కార్యదర్శి కిష్టయ్య



పిట్లంలో తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలకేంద్రం గోపాల్‌పేట గ్రామపంచాయతీ పరిధిలో 2025–26కు సంబంధించి తైబజార్ వేలంపాటను సోమవారం నిర్వహించారు. నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన కంచనపల్లి సాయాగౌడ్ అనే వ్యక్తి రూ.5లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నారు. గ్రామపంచాయతీ ముందుగా నిర్ణయించిన కనీస ధర కంటే అధికధర రావడంతో తైబజార్‌ను సాయాగౌడ్‌కు అప్పగిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య ప్రకటించారు. కార్యక్రమంలో మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ వంశీకృష్ణగౌడ్, మాజీ ఉపసర్పంచ్ దుర్గేష్, మండల మాజీ కో–ఆప్షన్ సభ్యుడు షాహెద్ పాష తదితరులు పాల్గొన్నారు.

పిట్లంలో..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ వి.కమలాకర్ ఆధ్వర్యంలో 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తైబజార్ వేలం పాట నిర్వహించారు. బాన్సువాడకు చెందిన రామాగౌడ్ రూ.12.58 లక్షలకు వేలం పాటలో తైబజార్‌ను దక్కించుకున్నారు. పశువుల క్రయ విక్రయ దాఖలాను పిట్లంకు చెందిన పత్తి హరీష్ రూ.6.58 లక్షలకు దక్కించుకున్నారు. గొర్రెలు మేకల దాఖలాకు సరైన ధర రాకపోవడంతో ఈ నెల 25కు వాయిదా వేశామని పంచాయతీ కార్యదర్శి బలరాం పేర్కొన్నారు.

కొబ్బరికాయల విక్రయానికి వేలం పాట

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయానికి సోమవారం ఆలయ కమిటీ సభ్యులు వేలం పాట నిర్వహించారు. ఉగాది పండుగ సందర్భంగా ఆలయం వద్ద వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. మండల కేంద్రానికి చెందిన బొల్లారం క్రాంతికుమార్ రూ. 30 వేలకు కొబ్బరికాయల విక్రయాన్ని వేలం పాటలో దక్కించుకున్నారు. ఆలయం హుండీ కోసం పూజారులు కుంట దుర్గయ్య రూ. 1.20 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయం అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామానికి చెందిన కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలను నిషేధించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెదలో మద్యం అమ్మకాలను నిషేధించాలని కోరుతూ సోమవారం గ్రామానికి చెందిన పలువురు యువకులు జీపీ కార్యదర్శి అశోక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో ప్రతి గల్లీకి ఒక బెల్ట్‌షాపు ఏర్పాటుచేసి విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుపుతున్నారని వారు తెలిపారు. అలాగే గ్రామంలోని పాఠశాల భవనాల్లో, దేవాలయాల్లో కూర్చొని మద్యం సేవిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా పిల్లలకు కూడా బెల్ట్‌షాపు నిర్వాహకులు మద్యం విక్రయిస్తున్నారని వారు ఆరోపించారు.

ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు తీసుకోవాలి



బాన్సువాడ : భవన, ఇతర నిర్మాణ రంగంలో పని చేస్తున్న వారందరూ లేబర్ కార్డు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు దుబాస్ రాములు అన్నారు. సోమవారం బాన్సువాడలో సీపీఐ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ కార్మిక శాఖ పరిధిలోని భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పని చేస్తున్న కార్మికులందరూ తప్పని సరిగా లేబర్ కార్డు తీసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు పాత బాన్సువాడలోని లేబర్ యూనియన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాములు, ఆగమయ్య, సాయిలు తదితరులున్నారు.

పోచారం కాలువకట్ట స్థల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బంజారవద్దనున్న పోచారం కాలువకట్ట స్థలాన్ని సోమవారం లింగంపల్లికలాన్, బంజారతండా పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఇరిగేషన్ ఏఈ అక్షయ్‌కుమార్ పరిశీలించారు. కాలువకట్టపై బంజారకు చెందిన ఓ వ్యక్తి దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, దీంతో రోడ్డుప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు వారు పోచారం కాలువకట్ట వద్దకు వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. దుకాణం ఏర్పాటు చేయదల్చిన స్థలం బఫర్‌జోన్‌లోకి వస్తుందని, అక్కడ దుకాణం ఏర్పాటు చేసేందుకు తాము అనుమతించబోమని ఏఈ అక్షయ్‌కుమార్ తేల్చి చెప్పారు. ఆయనవెంట ఇరుగ్రామాల పంచాయతీ కార్యదర్శులు వనజ, మమత, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

మార్మోగిన హనుమాన్ నామస్మరణ



మద్నూర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్‌పేట్ గ్రామంలో సోమవారం హనుమాన్ సామూహిక మహా మండల పడిపూజను స్వాములు వైభవంగా నిర్వహించారు. సుల్తాన్‌పేట్ హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో పలు రకాల పువ్వులతో పడిని అందంగా తయారు చేశారు. గణపతి హోమం, పాలు, తేనె, నెయ్యి తోపాటు పదకొండు రకాల అభిషేకాలు, మెట్లపూజ, అన్నదాన, అల్పాహార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో హనుమాన్ నామస్మరణ మార్మోగింది.

వైభవంగా ఓంకారేశ్వర స్వామి కల్యాణం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఓంకారేశ్వర ఆలయ తృతీయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఆలయంలో గౌరీ సమేత ఓంకారేశ్వర స్వామి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం మహిళలు ఓడి బియ్యం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ్ అధ్యక్షులు కపిల ప్రభాకర్, కంది శివరాములు, పట్టంశెట్టి శ్రీనివాస్, మాదంశెట్టి ఆంజనేయులు, జీవన్ దేశాయ్, పటేల్ రాజు, గంజి సంగమేశ్వర్, ఆంజనేయులుస్వామి, మారుతి, ఇంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయంలో విద్యార్థుల పూజలు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ సరస్వతి మాత ఆలయంలో సోమవారం ఆయా పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని గంజ్ ప్రభుత్వ, అడ్లూర్ ప్రభుత్వ, బ్రిలియంట్ ప్రైవేట్, శ్రీ చైతన్య, అభ్యాస, కృష్ణవేణి పాఠశాలల పదో తరగతి విద్యార్థులు సరస్వతీమాతను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు ఇచ్చి విద్యార్థులను ఆశీర్వాదించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ గ్రామం పశువైద్యశాల ఎదురుగా సోమవారం శివాజీ మహరాజ్ విగ్రహ నిర్మాణానికి గ్రామ యువకులు భూమిపూజ చేశారు. త్వరలోనే పనులు పూర్తి చేసి విగ్రహావిష్కరణ కార్యక్రమం చేపడుతామన్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో ఇఫ్తార్ విందు

మాచారెడ్డి : రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ సీనియర్ నాయకుడు పొన్నాల వెంకట్‌రెడ్డి స్థానిక ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. విందులో స్థానిక ముస్లింల ప్రతినిధులు పాల్గొన్నారు.